క్లుప్తంగా

విరాళాల సేకరణ

కల్వకుర్తిరూరల్: కేరళ రాష్ట్రంలో కొండచరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితులకు సహాయార్థం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో అశోక్, భీముడు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాడాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

లింగాల: మండలంలోని మాడాపూర్‌లో అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు ప్రశాంత్, అనిల్‌కుమార్‌లు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. రక్త నమూనాలను సేకరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బిక్‌లాల్, రాంచందర్, మల్లయ్య, ప్రభావతి, అశ్రస్ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు ఆయా బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకేపీ ఏపీఎం శేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని గుంతకోడూరు గ్రామ మహిళా సంఘాల సభ్యులు పొందిన రుణాలను చెల్లించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు పార్వతమ్మ, లక్ష్మి ఉన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లి తండాలో గిరిజనులు సోమవారం తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో నృత్యాలతో గిరిజనులు అలరించారు. గిరిజన యువతులు మొలకల బుట్లను తలపై పెట్టుకొని పూజల్లో పాల్గొన్నారు. డాక్టర్ అనురాధ, నాయకులు జగత్‌రెడ్డి, యాదిరెడ్డి, మల్లేష్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, సేవ్యానాయక్, సక్రాంనాయక్, పాండు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భరత్, రాజు, వాల్యానాయక్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి

కొల్లాపూర్ రూరల్: మాదిగ దండోరా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 13న హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు చేపట్టిన మాదిగ దండోరా విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని దండోరా జాతీయ నాయకులు మంద నరసింహ మాదిగ, ఎంబీసీ నాయకులు జీవన్ నాయుడు కోరారు. సోమవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. మాదిగ దండోరా జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సుప్రీంకోర్టు తీర్పు తరువాత రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. పాలమూరు ఉమ్మడి జిల్లా నుంచి మాదిగలు, ప్రజా సంఘాల నాయకులు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో దండోరా నాయకులు ఉన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండలంలోని మిట్యాతండా నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం లట్టుపల్లి నుంచి గంగారం గ్రామానికి ఇసుక లోడ్‌తో ట్రాక్టర్ వెళ్తుండగా బీట్ కానిస్టేబుల్ తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను బిజినేపల్లి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగశేఖరరెడ్డి తెలిపారు.

పశువైద్యశాలకు మరమ్మతు



తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి పశువైద్యశాఖ ఉప కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. వైద్యశాలలో పశువైద్య సహాయకుడు అస్లాం తన సొంత ఖర్చులతో భవనానికి మరమ్మతు పనులు చేపట్టారు. సున్నం, రంగులు వేయించారు. గ్రామ రైతులు, ప్రజలు అస్లాంను అభినందించారు.

ప్రజావాణిని వినియోగించుకోవాలి

చారకొండ: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల అన్నారు. మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చారకొండ గ్రామానికి చెందిన రైతు సర్వే నెం 783, 784లో తమ భూమిని సర్వే చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సమస్యలపై పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా శంకర్

ఉప్పునుంతల: మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా శంకర్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంఈఓగా పనిచేసిన రామారావు హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కల్వకుర్తి ఎంఈఓగా పనిచేస్తున్న శంకర్‌కు ఇన్‌చార్జ్ ఎంఈఓ బాధ్యతలు అప్పగించారు. స్థానిక ఎమ్మార్సీలో నాయకులు సన్మానించారు. బిచ్యానాయక్, మల్లికార్జున్, శ్యాంసుందర్, అజ్మతుల్లా, నరసింహ్మరెడ్డి, అమీర్‌పాషా, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటలపై తెగుళ్ల బెడద

- సస్యరక్షణ చర్యలతో లాభాలు
- పిచికారి విధానంపై అవగాహన సదస్సులు



వరి పంటకు గుళికలు చల్లుతున్న రైతు

తాడూరు: మండల వ్యాప్తంగా వానాకాలంలో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ఇప్పటి వరకు మొక్కజొన్న, వరి, పత్తి వరిని సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపారు. పంటలపై తెగుళ్ల బెడద అధికంగా కనిపిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆశించిన స్థాయిలో లాభాలు వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

వరి తెగుళ్ల నివారణ చర్యలు

ప్రస్తుతం వరికి అగ్గి తెగులు ఆశించే ప్రమాదం ఉంది. తెగుళ్ల ఆనవాళ్లు కనిపిస్తే తక్షణం నివారణ చర్యలు చేపట్టాలి. ట్రైసైక్లోజల్ 0.5 గ్రాములు లేదా ఇసోప్రథైలిన్ 0.5 మి.లీ.లు, కాస్గామైసిన్ 2.5 మి.లీ.లు లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలని అధికారులు సూచిస్తున్నారు. పిలకలు దుబ్బ చేసే దశలో ఉన్న వరి పంటలో కాండం తొలిచే పురుగు ఆశించే ప్రమాదం ఉంది. దీని నివారణకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ గులికలు, 4 కిలోల క్లోరాన్‌ట్రిమిలిట్రోల్ 0.4జీ గుళికలను వేసుకోవాలి. వరిని బ్యాక్టీరియా, ఎండుటాకు తెగులు కూడ ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 30 గ్రాముల కాఫర్, ఆక్సిక్లోరైర్, 2 గ్రాముల ప్లాంటోమైసిన్ మందును లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి. అదేవిధంగా వరిని ఉల్లికోడ్ ఆశించే పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు



పత్తిచేనులో పిచికారి చేస్తున్న రైతు

గమనించాలని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అక్కడక్కడ తాటాకు తెగులు కనిపిస్తుంది. దీని నివారణకు 2 మి.లీ.ల ప్రాపనోపాస్, 2.5 మి.లీ క్లోరోఫైరిపాస్ మందును లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలి. కొన్ని పంటలలో ఆకుముడత

అధికారుల సూచనలు పాటించాలి



పంటలో తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించారు. చీటపీడలు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పంటలను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అవసరమైన మందులు పిచికారి చేయాలి. – సాయిరమేష్‌కుమార్, ఏఓ

కూడ కనిపిస్తే 2 గ్రా.ల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 0.4 మి.లీ.ల క్లోరాంట్రిమిలిక్రోల్ మందును లీటర్ నీటితో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలి.

పత్తిపంటలో..

ప్రస్తుతం పత్తి పంటలో పేనుబంక ప్రభావం ఉంటుంది. దీని నివారణకు 5 మి.లీ.ల వేపు నూనె, 0.25 మి.లీ.ల ఇమిడాక్లోపిడ్ మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలి. తామరపురుగు పచ్చదోమ ఆశిస్తే 2 మి.లీ.ల ట్రిపోనిల్ 0.3 గ్రా.ల క్లోనికామిడ్ 0.75 మి.ల సల్ఫాక్స్‌ప్లోర్ మందును లీటర్ నీటిలో కలిపి స్ప్రే చేయాలి. పండాకు తెగులు ఆశిస్తే మెగ్నిషియం దాతువు లోపం నివారణకు 10 గ్రా.ల మెగ్నిషియం సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రా.ల కాఫర్‌ఆక్సిక్లోరైడ్, 1 గ్రా. కార్బండిజమ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. పత్తిలో అక్కడక్కడ గులాబిరంగు పురుగు ప్రభావం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీని ఉనికిని గమనించడానికి ఎకరాకు 4 లింగార్చక బుట్టలు ఏర్పాటు చేసుకొని వరుసగా మూడు రోజులు 7, 8 రెక్కల పురుగులు గమనించినట్‌లెతై సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నివారణకు 1.5 గ్రా.ల థైయోడికార్బ్, 2 మి.లీ.ల క్లోరోఫైర్‌పాస్ మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలని వ్యవసాయ అధికారులు వివరించారు.

విధుల్లోకి తీసుకోవాలని డీఈఓకు వినతి



డీఈఓ గోవిందరాజులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: నాణ్యత లేని వస్తువులను పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుండా వర్కర్లను బాధ్యులను చేయడం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం పెంట్లవెల్లిలో విధుల నుంచి తొలగించిన వర్కర్లను తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీఈఓ గోవిందరాజులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కస్తూర్బాగాంధీలో వర్కర్లను తొలగించడం సరైందికాదని వివరించారు. నాణ్యతలేని వస్తువులను వేస్తే అందుకు కారణం వర్కర్లు కాదని అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, ఇంద్ర, అలివేల తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి అమానుషం



అమ్రాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న నాయకులు



తెలకపల్లిలో..

అమ్రాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి చేయడం అమానుషమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. వివేకానందయూత్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ ఘటనలను నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక అమరేశ్వర ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్ హిందువులకు రక్షణ కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ రావూఫ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, అధ్యక్షుడు గోలి రాజు, పరమేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, అత్యాచారాలు, హత్యలను ఖండించేందుకు పార్టీలకు అతీతంగా హిందువులు ఐక్యం కావాలని హిందూ ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కల్వకుర్తిలో రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. బంగ్లాదేశ్ హిందువులకు మద్దతు ఈ నెల 14న పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

నిరసన ర్యాలీ

తెలకపల్లి: విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం రాత్రి నిరసన తెలిపారు. బంగ్లాదేశ్‌లో ఉగ్రవాదులు హిందువులపై చేస్తున్న దాడులు, దారుణాలపైన వారు నిరసన వ్యక్తం చేసి తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు ఉమాపతి ఆచార్యులు, కిషోర్, నరేందర్, పర్వతాలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నషా ముక్త్ భారత్ అభియాన్

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో ఉన్న పాలమూరు విశ్వవిద్యాలయం కళాశాల పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ ఆధ్వర్యంలో సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్, మాదక ద్రవ్య రహిత భారత్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియస్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల జీవితం నాశనం అవుతుందన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న బోధనేతర సిబ్బంది, అధ్యాపకులు

కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన భవనాన్ని నిర్మించాలి



నిరసన తెలుపుతున్న బీఎస్ఎఫ్ నాయకులు

కొల్లాపూర్ రూరల్: పట్టణంలో ఉన్న రాణి ఇందిరాదేవి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని నూతన భవనాన్ని నిర్మించాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బంకల దాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థులతో కలిసి కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొందని వాపోయారు. కళాశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. పాలకులు స్పందించి నూతన భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి

అమ్రాబాద్: కొల్లాపూర్ నియోజకవర్గం ముక్కిడిగుండంలో మశమ్మ కాలిన ఘటనపై పారదర్శకంగా పూర్తిగా చేపట్టాలని కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా కన్వీనర్ మొద్దునూరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కేఎన్‌పీహెచ్ కో కన్వీనర్ మంతటి పర్వతాలు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి జక్కబాలయ్యలతో పాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మశమ్మను పరామర్శించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. మశమ్మ కాలిన ఘటనపై అనుమానాలున్నాయని పూర్తి విచారణ చేయాలన్నారు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆస్పత్రికి తరలించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేసి వెట్టి చాకిరి నుంచి పిల్లలను విముక్తి చేయించాలని డిమాండ్ చేశారు. కృష్ణయ్య, రాములు, వెంకటేష్, అంబయ్యలు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



తాడూరు: పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు లయన్స్ క్లబ్ కృషి చేస్తుందని అధ్యక్షుడు రాధారెడ్డి, మాజీ గవర్నర్ రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలతో పాటు మేడిపూర్ ఉన్నత పాఠశాలలకు సోమవారం వాటర్‌ట్యాంకులను అందజేశారు. లక్ష్మి, రాజవర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, హెచ్ఎం అనీల్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేష్, సురేష్, పద్మాలయ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన వెంకటయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ విషయాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి బీఆర్ఎస్ నాయకులు తీసుకెళ్లారు. ఆయన స్పందించిన రూ.3 వేలు సమకూర్చారు. సోమవారం ట్రస్టు సభ్యులు గణేష్, సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రుక్మద్దిన్, వెంకటరత్నం, పరశురాములు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కొల్లాపూర్ రూరల్: మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మండల విద్యాశాఖ అధికారి చంద్రుడు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో పెంట్లవెల్లి, కొల్లాపూర్ మండలాల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, స్కావెంజర్, ఎఫ్ఆర్ఎస్, అటెండెన్స్ సక్రమంగా చూసుకోవాలన్నారు. హెచ్ఎంలు, నోడల్ అధికారులు, క్లస్టర్ రిసోర్స్‌లు పాల్గొన్నారు.

కేఎల్ఐ ఉప కాల్వ పనులు ప్రారంభం

చారకొండ: మండలంలోని జూపల్లి శివారులో కేఎల్ఐ 16వ నంబర్ ఉప కాల్వ నిర్మాణ పనులను సోమవారం డీఈ సమ్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారంలో ఉప కాల్వ నిర్మాణ పనులు చేపట్టాలని జూపల్లి రైతులు, నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని దీంతో ఎమ్మెల్యే సూచన మేరకు పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ఏఈ శ్రీకాంత్, నాయకులు వెంకటయ్య యాదవ్, ముజ్జు, రామచంద్రి, శ్రీనివాస్ ,రైతులు విజయ్, అలీ,సైదులు గ్రామస్తులు ఉన్నారు.

తాగుబోతు వీరంగం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని నాగనూలు చౌరస్తాలో సోమవారం రాత్రి తాగుబోతు వీరంగం సృష్టించారు. గుర్తు తెలియని వ్యక్తి మద్యం తాగి నాగనూలు చౌరస్తాలో తన ద్విచక్రవాహనాన్ని ప్రధాన రహదారిపై అడ్డంగా నిలిపాడు. దీంతో వాహనరాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మద్యంబాబుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడ నుంచి మెల్లిగా జారుకున్నాడు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన అవసరం

బల్మూర్: ఆయుర్వేద వైద్యంపై అందరికి అవగాహన ఉండాలని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని కొండనాగులలో సోమవారం నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో జీరియాట్రిక్–వయో వృద్ధుల వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల ప్రజలు ఇప్పటికి ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముతారని పేర్కొన్నారు. శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ప్రోగ్రాం అధికారి నరేష్, ఆయుర్వేద



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వైద్యులు గోపాల్‌నాయక్, విజయ, ఫార్మసిస్టులు భాస్కర్, గోవిందు, వరలక్ష్మి, ఏఎన్ఎం సజాత, పద్మ, ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి



సభ్యత్వ నమోదును చేస్తున్న ఉపాధ్యాయులు

లింగాల: విద్యాశాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్య శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని అప్పాయపల్లి పాఠశాలలో సోమవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించి ఎంఈఓ, జేఎల్, డైట్ లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీలో ఓటు హక్కును కల్పించాలని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూజారి పురుషోత్తం, రామస్వామి, పాండుగౌడు పాల్గొన్నారు.

గడువు ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయొద్దు

పెద్దకొత్తపల్లి: గడువు ముగిసిన విత్తనాలను కొనుగోలు చేయొద్దని పారాలీగల్ వలంటీర్ శ్రీనివాసులు కోరారు. సోమవారం మండలంలోని పెద్దకార్పాముల రైతు వేదికలో అగ్రి లీగల్ క్లినిక్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయం, విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రకళ, బాబు, చిన్న, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లమ్మ, మల్లయ్య పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న పారాలీగల్ వలంటీర్ శ్రీనివాసులు

బాలగంగాధర్ తిలక్ ఆశయాలు సాధిద్దాం



తిలక్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: బాలగంగాధర్ తిలక్ ఆశయాలను కొనసాగిద్దామని హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ నీరుకంటి రాఘవేందర్ గౌడ్ కోరారు. సోమవారం పట్టణంలోని తిలక్‌నగర్ కమాన్ వద్ద ఉన్న బాలగంగాధర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో తిలక్ పాత్ర ఎంతో గొప్పదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, రవిగౌడ్, సురేందర్ గౌడ్, నర్సింహా, వివేకానంద, నరేశ్‌గౌడ్, గంగాధరాచారి, తిలక్‌నగర్ కాలనీ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, లక్ష్మీనరసింహా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని శ్రేష్ఠ ఫౌండేషన్ చైర్మన్ శ్యాంపూరి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాచూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా షూ, టై, బెల్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుష్మారవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా ఫౌండేషన్ ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నత స్థాయిలో రాణించేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి సంస్థ ద్వారా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుత్తి వెంకటయ్యయాదవ్, సింగిల్‌విండో డైరెక్టర్ రాఘవేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, వెంకటయ్య, జంగయ్య, తాజీదీన్, ప్రవీణ్, హెచ్‌హెం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు జంగయ్య, కిష్టారెడ్డి, రామకిషన్‌రావు, మురళీధర్, సురేష్, జైపాల్ తదితరులు ఉన్నారు.



షూలు అందజేస్తున్న సభ్యులు

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల ఉన్నత పాఠశాలలో క్లాస్‌మెట్ క్లబ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్టులు, బ్యాడ్జీలను 1980 ఎస్ఎస్‌సీ పూర్వ విద్యార్థులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. దేవల్ తిరుమలాపూర్ గ్రామానికి చెందిన రాజయ్య, లక్ష్మీనరసింహ గౌడ్లు చందాలు వేసుకుని టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్ కుమార్, హెచ్ఎం జీయోద్దీన్, క్లాస్‌మెట్ క్లబ్ ఫౌండర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని సీపీఐ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం విద్యార్థి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో 1936న ఏఐఎస్ఎఫ్ సంఘాన్ని భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, ఆజాద్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు నరేష్, నితిన్, జైరాం, పద్మ, గణేష అరవింద్, వంశీ, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల విద్యార్థుల నిరసన



జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులు

నాగర్‌కర్నూల్ క్రైం: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఓ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య చేయడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యవిద్యార్థులు మాట్లాడుతూ మహిళ వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్యులపై చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

వాటర్ ట్యాంక్ కూల్చివేత

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న నీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ను సోమవారం కూల్చివేశారు. కొన్నేళ్ల కిందట గ్రామానికి నీటి సరఫరా కోసం నిర్మించిన ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి అతి ప్రమాదకరంగా మారింది. చుట్టూ ఇళ్లు, పాఠశాల ఆవరణలో ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. ట్యాంకును కూల్చివేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు విన్నవించారు. దీంతో గ్రామస్తుల సహాయంతో కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో జేసీబీతో ప్రమాదభరితంగా ఉన్న నీటి ట్యాంకును కూల్చివేశారు. అంతకుముందే విద్యార్థులను, సమీపంలోని నివాస గృహాల వారిని అప్రమత్తం చేసి ట్యాంకును కూల్చివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ట్యాంకును కూల్చివేస్తున్న జేసీబీ